
Happy New Year
నవతరం
తెలుగు దినపత్రిక
వరదరాజు శిరిగిరి
ఎడిటర్, నవతరం మీడియా గ్రూప్
నవతరం పత్రికను నమ్మి
ఆదరిస్తున్న పాఠకులకు,
స్నేహితులకు,సమాజ హితానికి
పనిచేస్తున్న అధికారులకు,
రాజకీయ నాయకులకు,ప్రతి ఒక్కరికీ
ఈ నూతన సంవత్సరం సత్యం, సేవ,
విజయాలతో నిండాలని కోరుకుంటూ
నూతన సంవత్సర
శుభాకాంక్షలు
2026
నవ చైతన్య శిరిగిరి
నవతరం న్యూస్ యాజమాన్యం

# మేమే 'మీడియా' అంటూ

# ఇన్ఫ్లెన్సర్ల అత్యుత్సాహం?

నవతరం
తెలుగు దినపత్రిక
RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 70 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
01-01-2026 గురువారం వెల : 1/- పేజీలు : 4

- జర్నలిస్టులను పక్కనబెట్టి ఇన్ఫ్లెన్సర్ సోషల్ మీడియాకు రాజకీయ అధికారిక వత్తాసు
- ఆర్ఎన్ఐ, ఐటీ, సీఏ నిబంధనలు పాటించే పత్రికా ప్రతినిధులకు గౌరవం లేదా..?
- శాటిలైట్ చానెల్స్‌ని కూడా పిలవకుండా 'గొప్పత బోధన'లో ముందున్న నాయకత్వమా?
- వాట్సాప్ గ్రూపుల్లో ఇన్ఫ్లెన్సర్ నంబర్లు ఎవరి అనుమతితో ఏడ్ చేశారో?
- ముఖ్య అతిథుల పర్యటనల్లో మీడియా ఎంపిక ఎవరి చేతుల్లో ఉంది?
- సంక్రాంతి ప్రకటనలు పత్రికలకాదు సోషల్ మీడియా డీల్స్‌కేనా?
- రూ.5,00010,000కి 'మేమే మీడియా'గా అంటూ మారుతున్న వ్యవస్థ?
- వ్యాపారం, రాజకీయం, మతం అన్నింటిపైనా ఇన్ఫ్లెన్సర్ల పెత్తనమా?
- ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు అప్రమత్తం అవుతారా?




(నవతరం ప్రతినిధి శ్రీకాకుళం)

నిబంధనలు ఉన్నవారికి శిక్షలు, నిబంధనలు లేనివారికి గౌరవాలు అన్నట్టుగా పత్రికలకు చట్టాలు, ఇన్ఫ్లెన్సర్లకు చుట్టాలు అనే పరిస్థితి శ్రీకాకుళం జిల్లాలో జర్నలిజాన్ని తలకిందులు చేస్తోంది. ఆర్ఎన్ఐ, ఐటీ, సీఏ నిబంధనలు పాటించే పత్రికలు పక్కకు నెట్టివేయబడుతుంటే, ఏ చట్టబద్ధతా లేకుండా 'మేమే మీడియా' అన్న భ్రమతో ఇన్ఫ్లెన్సర్ సోషల్ మీడియా వర్గాలు ప్రచారం పేరుతో దందాకు తెరలేపుతున్నాయి. పత్రికల వాట్సాప్ గ్రూపులు, అధికారిక సమాచార వ్యవస్థలు వీళ్ల చేతుల్లోకి వెళ్లిపోతుండగా, నిజమైన జర్నలిస్టులు గుమ్మం బయట నిలబడే పరిస్థితి నెలకొంది. ఇది కేవలం మీడియా సమస్య కాదు ప్రజాస్వామ్యానికి మోగుతున్న హెచ్చరిక గంట. శ్రీకాకుళం జిల్లాలో జర్నలిజంలో విలువలు రోజురోజుకూ తగ్గుతున్నాయి. దానికి కారణం పత్రికల లోపం కాదు వ్యవస్థలో చోటు చేసుకున్న ప్రమాదకర మార్పు. ఒక పత్రిక నడపాలంటే ఆర్ఎన్ఐ రిజిస్ట్రేషన్, ఐటీ రిటర్న్స్, సీఏ సర్టిఫికెట్లు, డిపిఆర్‌ఓకు రోజువారీ ప్రచురణ కాపీలు అందజేయడం,, చట్టబద్ధమైన సర్క్యులేషన్ వివరాలు తప్పనిసరి. ఒక్క చిన్న తప్పు జరిగినా నోటీసులు, బెదిరింపులు, గుర్తింపు రద్దులు తప్పవు. కానీ ఇదే జిల్లాలో ఏ నిబంధనలు లేని, ఏ చట్టబద్ధత లేని ఇన్ఫ్లెన్సర్ సోషల్ మీడియా వర్గాలు 'మేమే మీడియా' అన్న స్థాయిలో తయారవుతున్నాయి. శాటిలైట్ చానెల్స్‌కూ పిలుపుల్లేవు ఇదే కొత్త సంస్కృతినా? అత్యంత ఆందోళనకర విషయం ఏమిటంటే కొన్ని సందర్భాల్లో పెద్ద టీవీ చానెల్స్‌ను కూడా పిలవకుండా, ఇన్ఫ్లెన్సర్ సోషల్ మీడియా వ్యక్తులతోనే కార్యక్రమాలు నిర్వహిస్తూ, తాము ఎంత గొప్పవారమో బోధించుకోవడంలో రాజకీయ నాయకులు, అధికారులు శ్రీకాకుళం జిల్లాలో ముందుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పత్రికల కోసం ఏర్పాటు చేసిన అధికారిక వాట్సాప్ గ్రూపుల్లోకి ఇన్ఫ్లెన్సర్ సోషల్ మీడియా నంబర్లు చొరబడటం, సమాచారం ముందుగా వాళ్లకే చేరటం, వాళ్లే ఎవరు ముఖ్యం, ఎవరు కాదు అని నిర్ణయించడం ఇప్పుడు సాధారణ విషయంగా మారిపోయింది. ఇది జర్నలిజంపై జరుగుతున్న బహిరంగ అవమానం కాదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

సంక్రాంతి ప్రకటనల దారి మళ్లింది దెబ్బ పత్రికలకేఇదే సమయంలో సంక్రాంతి వంటి పండుగల సమయంలో వ్యాపారవాణిజ్య వ్యవస్థలు ఇన్నాళ్లు పత్రికలకు తమ వంతు సహాయం చేసేవి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. ఏ నిబంధనలూ లేకుండా రూ.5,000 నుంచి రూ.10,000 వరకు తీసుకుని ఇష్టానుసారంగా సోషల్ మీడియాలో ప్రచారం చేసే ఇన్ఫ్లెన్సర్ సోషల్ మీడియా వర్గాల వైపే వ్యాపారులు మొగ్గు చూపుతున్నారు. దీంతో సంవత్సరాలుగా పత్రికలను నమ్ముకుని నిలబడిన చిన్న పత్రిక యాజమాన్యాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో కూరుకుపోతున్నాయి. రాజకీయం నుంచి మతం వరకూ ఇన్ఫ్లెన్సర్ల పెత్తనమేనా? ఇక్కడితో సమస్య ఆగడం లేదు. రాజకీయం మాత్రమే కాదు వ్యాపారం, సామాజిక అంశాలు, ఇక చివరికి హిందూ మత ధర్మాలపై కూడా ఇన్ఫ్లెన్సర్ సోషల్ మీడియా వర్గాలు తామే పెద్దలమన్నట్టుగా తీర్పులు చెప్పే స్థాయికి వెళ్లిపోయాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరు వీళ్లకి ఈ అధికారం ఇచ్చారు? ఎవరి తరఫున వీళ్లు మాట్లాడుతున్నారు? ఎలాంటి బాధ్యతతో వీళ్లు సమాజాన్ని ప్రభావితం చేస్తున్నారు? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా అప్రమత్తం కావాల్సిందే..

సోషల్ మీడియా అవసరం. కానీ నియంత్రణ లేకుండా, బాధ్యత లేకుండా, డబ్బే ప్రమాణంగా వ్యవస్థను ప్రభావితం చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా అధికారులు, రాజకీయ నాయకులు అప్రమత్తం కావాలి. పత్రికల గ్రూపులు పత్రికలకే పరిమితం కావాలి. సమాచారం అందరికీ సమానంగా ఇవ్వాలి. నిబంధనలు ఉన్నవారికే గుర్తింపు ఉండాలి. లేకపోతే ఈ మౌనం రేపు జర్నలిజం సమాధిపై శాసనంగా మిగులుతుంది. నాలుగో స్తంభాన్ని కూల్చితే మిగతా స్తంభాలు నిలబడవు. జాగ్రత్త మీడియా సోదరులారా! సంఘాలు వేర్వేరు కావచ్చు, పత్రికలు వేర్వేరు కావచ్చు, కానీ మనందరం ఒకటే నిజమైన మీడియా సోదరులు. నిబంధనలు పాటించే పత్రికలకు గౌరవం ఇచ్చి, సమస్తం కలిసి నిలబడితే మాత్రమే జర్నలిజం జీవిస్తుంది....

# బాధితులకు అండగా ధర్మాన రామ్





- గార మండలంలో దాడులకు నిరసన
- గాయపడిన కార్యకర్తలకు పరామర్శ
- చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్

**(నవతరం గార)**

గార మండలం వాడాడ పంచాయతీ అచ్చెన్నపాలెం గ్రామంలో దాడికి గురై తీవ్రంగా గాయపడిన వైఎస్ఆర్‌సీపీ కార్యకర్త కంచు మధుసూదనరావు విషయాన్ని తెలుసుకున్న యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు వెంటనే గార ఎస్‌ఐతో ఫోన్‌లో మాట్లాడి ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకున్నారు. బాధితుడికి ధైర్యం చెప్పి, న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం గార మండలం శ్రీకూర్మం పంచాయతీ సేగిడిపేటలో దాడికి గురై గాయపడిన వైఎస్ఆర్‌సీపీ కార్యకర్త కలగ కృష్ణను కూడా పరామర్శించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఆయనకు భరోసా ఇచ్చిన ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, రాజకీయ కక్షతో జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో వాడాడ సర్పంచ్ సుంకాన సురేష్, మాజీ సర్పంచ్ బిన్నడ తేజ, వైస్ ఎంపీపీ అందవరపు బాలకృష్ణ, బరాటం నాగేశ్వరరావు, పట్నాల కోటి, పల్ల శ్రీను, చింతు శ్రీను, కంచు వరహాలు, గురువు విశ్వేశ్వరరావు, గురువు అప్పలనాయుడు, కంచు భాస్కర్ రావు, తాల అప్పన్న, సాధు ఉపేంద్ర, గురువు బుజ్జి తదితర వైఎస్ఆర్‌సీపీ నాయకులు, మహిళలు, యువత పాల్గొన్నారు.



ఎడిటోరియల్

# ఇదా మన సంస్కృతి!

వాళ్లిప్పుడు క్రిస్టియన్ల కోసం వచ్చారు. రేపు మన కోసమూ వస్తారు. వాళ్లు మానవత్వం మరచినవాళ్లు. అరాచకమై నిలిచినవాళ్లు. అసహన అలంకారులు. విద్వేషం వారి భాష. విధ్వంసం శ్వాస. ఉన్మాదం వారి తాత్వికత. ప్రేమ, కరుణలు వారి శత్రువులు. సనాతన ధర్మ పెదవులపై పలుకులు. అధర్మం, హింస ఆచరణలు. వీళ్లెవరో ఇంకా చెప్పాలా! మహానటులు, అబద్దా నిబద్దులు. చట్టాలను తమ చేతుల్లోకి తీసుకున్న మతోన్మాదులు. పిచ్చివాడి చేతిలో రాయుంటే కొన్ని గాయాలతో బయటపడవచ్చు. మతోన్మాది చేతిలో అధికారముంటే, దేశం మొత్తం రక్తం చిందుతుంది. హృదయాలన్నీ మానని గాయాలవుతాయి. ఇప్పుడు దేశం మనస్సు గాయాలతో శోకిస్తున్నది. భిన్నత్వంలో ఏకత్వం రక్తమోడుతున్నది. ప్రజాస్వామిక లౌకికవిలువలు విలపిస్తున్నవి. సనాతనం మాటున కిరాతకం రాజ్యమేలుతున్నది. వాళ్లిప్పుడు క్రిస్మస్ వేడుకలపైకి వచ్చారు. రేపు మన ఇంట్లో వేడుకల్లోకి వస్తారు. విలువల్ని విశ్వాసాల్ని ధ్వంసమొనరుస్తారు. కరుణామయుడు, శాంతి బోధకుడుగా పేరున్న క్రీస్తు జన్మదినాన్ని ప్రపంచమంతా డిసెంబరు మాసపు చివరలో పండుగ చేసుకుంటారు. పూల మెరుపులతో చెట్టు, శాంతా క్లాజ్ ఎర్రని టోపీలు ధరించి క్రిస్మస్ తాతయ్య అందించే తీయతీయని బహుమతులు. ఇంటి ముందు నక్షత్ర వెలుగుల అలంకరణ, ప్రార్థనలు అందరం కలిసే చేసుకునే వాళ్లం. అది రంజాన్ అయినా సంక్రాంతి అయినా క్రిస్మస్ అయినా అందరికీ పండుగలానే అనిపించేది. అన్నీ పంచుకునే వాళ్లమే. ఎందుకంటే వాళ్లంతా భారతీయులే. క్రిస్మస్‌రోజు నా స్నేహితుడి ఇంట్లో అరిసెలు, సకినాలు, సేమియా చేసి పెట్టేవాళ్లు. మన వంటకాలే. క్రీస్తు పేదలకోసం పోరాడి శిలువ వేయబడ్డాడని ప్రేమించే వాళ్లము. మరిప్పుడు వీళ్లకు ఏమయింది. ఇలా పండుగ సమూహాలపై మూకలు దాడులు చేస్తున్నారు. నక్షత్ర వెలుగుల అలంకరణలపై పెట్రోలు పోసి తగలేస్తున్నారు. ఏ ధర్మం, ఏ దేవుడు చెప్పాడిలా చేయమని, ఏమిటీ పైశాచిక ఆనందం! క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్న క్రిస్టియన్లను బెదిరిస్తూ, దుర్భాషలాడుతూ విధ్వంసానికి పాల్పడుతున్నారు విశ్వహిందూ పరిషత్, ఆరెస్సెస్, భగజరంగ్‌దళ్ సమూహాలు. చర్చీల ముందుచేరి జైశ్రీరాం అంటూ హనుమాన్ చాలీసాలు చదువుతూ ఆటంకాలు కలిగిస్తున్నారు. పోలీసులుకానీ, అధికారులుకానీ, ప్రభుత్వంకానీ ఈ అరాచకాన్ని అడ్డుకోవటం లేదు. కనీసం ప్రభుత్వమూ ఇది సరికాదని ప్రకటించనూ లేదు. డిసెంబరు 22న ఢిల్లీలోని లాజ్‌పత్‌నగర్ ఏరియాలో కొంతమంది మహిళలు, పిల్లలు, శాంతాక్లాజ్ టోపీలు ధరించి క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటూ ఉంటే, ఒక రౌడీ మూకవచ్చి, వాళ్లని బెదిరించి వెళ్లగొట్టారు. సెంట్‌మేరీస్ స్కూల్, పానిగ్గాన్, నల్‌చారిలో వీహెచ్‌పి, భజరంగ్‌దళ్ మూక వెళ్లి క్రిస్‌మస్ అలంకరణను కాల్చేసి జైశ్రీరాం అనే నినాదాలు చేశారు. ఛత్తీస్‌గఢ్ రారుపూర్‌లోని ఒక మాల్‌పై దాడిచేసి క్రిస్మస్ అలంకరణ పగులగొట్టి తగులబెట్టారు. ఒరిస్సాలో క్రిస్‌మస్, శాంతాక్లాస్ టోపీలను విక్రయిస్తున్న వీధి పేద అమ్మకందార్లను బెదిరిస్తూ, ఇది క్రిస్టియన్ దేశం కాదు, హిందూదేశం, ఇక్కడ అమ్మవద్దని వారిని తరిమేసారు కొందరు కాషాయ మూకలు. ఇంకా ఘోరమైన విషయాలేమిటంటే, సత్యనిష్ట ఆర్య అనే హిందూ అవతారమెత్తిన ఒక కాషాయధారి, మూకతో కలిసి ప్రార్థన చేయిస్తున్న పాస్టర్ దగ్గరికి వెళ్లి మైకులాక్కుని, 'మీ జీసస్ ఎలా పుట్టాడో చెప్పు', మేరీకి ఎలా కడుపు అయిందో చెప్పమని అసహ్యంగా ప్రశ్నించాడు. ఒక మహిళ అడ్డువచ్చి వివరిస్తుంటే, 'నువ్వెలా పుట్టావో నీకు తెలుసా' అని కించపరిచాడు. ఛత్తీస్‌గఢ్ బదెటివ్డా గ్రామంలో క్రిస్టియన్ మతం పుచ్చుకున్న ఓ పెద్దాయన చనిపోతే, అతన్ని హిందూ ఆచారంలోనే అంత్యక్రియలు జరపాలని అడ్డుకుని దౌర్జన్యం చేశారు. ఒక పాస్టర్ ఇంట్లోని బైబిల్స్ అన్ని బయటపడేసి నిప్పుపెట్టి, ఆయనతోనే మంటల్లో వేయించి, దౌర్జన్యంగా క్షమాపణలు రాయించడం ఎంత దారుణం! ఇవన్నీ జరుగుతుండగానే మన మహానట చక్రవర్తి ఢిల్లీలోని కెథడ్రాల్ చర్చిలోకి వెళ్లి క్రిస్‌మస్ ప్రార్థనా గీతాలకు తన్మయుడై భక్తిని ప్రదర్శించాడు. క్రిస్టియన్లతో మన దేశానికి ఎప్పటి నుండో ఆత్మీయ సంబంధాలున్నాయనీ వాక్రుచ్చారు కూడా. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, కేరళ, తమిళనాడు మొదలైన ప్రాంతాల్లో క్రిస్‌మస్ వేడుకలను లక్ష్యంగా చేసుకుని విధ్వంసం చేస్తుంటే పోలీసు ఉన్నా పట్టించుకోలేదు. 'సబ్‌కా సాత్' అంటే ఇదేనా! రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు ప్రకారం, ఏ మతాన్నయినా, విశ్వాసాన్నయినా కలిగివుండవచ్చు. ఈ హక్కును అడ్డుకోవడం అంటే రాజ్యాంగాన్ని అడ్డుకోవడమే. ఒకవేళ ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే, చర్యలు తీసుకోవాల్సింది చట్టం, ప్రభుత్వం, కానీ ఈ కాషాయ మూకలు కాదు. రాబోయే రోజుల్లో కేరళ, తమిళనాడు, బెంగాల్‌లలో ఎన్నికలు జరుగనున్నాయి. వాటిలో నినాదాలను రెచ్చగొట్టి గెలవాలన్న దుష్టపన్నాగంలో భాగమే ఈ దాడులు. వీటిని దేశంలోని సమస్త ప్రజలు వ్యతిరేకించి, దేశ సహనపూరిత వారసత్వాన్ని చాటాలి. ఐక్యతగా నిలవాలి!

# ముఠా సభ్యులను తక్షణమే అరెస్ట్ చెయ్యాలి




**నవతరం -శ్రీకాకుళం**

శ్రీకాకుళం డీఎస్‌పీ గారిని శ్రీకాకుళం జిల్లా దళిత సంఘాల జేఏసీ ప్రతినిధులు కలిసి శ్రీకాకుళం పట్టణములో అంబేద్కర్ విగ్రహన్ని పాక్షికంగా ద్వాంసం చేసిన దాసరి వెంకట సాయికిరణ్ మరియు వారి ముఠా సభ్యులను తక్షణమే అరెస్ట్ చెయ్యాలి. అలాగే బలగ లో నివాసం ఉంటున్న దళిత విద్యావంతుడు నూతలపాటి పై దాడి చేసిన ఆడిపథ్య కులానికి చెందిన రెడ్డి సూర్యనారాయణ అనుచర ముఠాను తక్షణమే అరెస్ట్ చెయ్యాలి. దళిత బాధితుల పైన అక్రమ కేసు పెట్టిన 2 టౌన్ పోలీసులపై చర్యలు తీసుకుకోవాలి. నిందితులైన రెడ్డి సూర్యనారాయణ ఆర్ధికంగా, సామాజికంగా, కుల పరంగా, రాజకీయ పరంగా బలవంతుడు కావడం వలన బాధితులను భయపెట్టి, ప్రలోబాలకు గురిచేస్తున్న రెడ్డి సూర్యనారాయణ మరియు అతని ముఠాని తక్షణమే పోలీస్ కస్టడీ లోకి తీసుకొని విచారణ చెయ్యాలి. సరుబుజ్జిలి మండలం, కొండవలస గ్రామానికి చెందిన దళిత మైనర్ బాలిక అయిన కుమారి దీపికపై లైంగిక దాడి చేసిన ఆడిపత్య కులానికి చెందిన గేదెల సుధ ను తక్షణమే అరెస్ట్ చెయ్యాలి. శ్రీకాకుళం జిల్లాలో పోలీస్ శాఖ నిర్లక్ష్యం వలన తక్షణం స్పందించకపోవడం వలన విపరీతంగా దాడులు జరుగుతున్నాయి. తక్షణమే జిల్లా SP స్పందించి నిందితులు అందరినీ తక్షణమే అరెస్ట్ చేసి భవిష్యత్తులో దాడులు జరగకుండా నివారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోతల దుర్గారావు గారు, గంజి ఏజ్రాగారు, బైరి ధనరాజ్, రాయి సూర్యనారాయణ, మిస్కా కృష్ణయ్య, దండాసి జాన్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో శ్రీకాకుళాన్ని అగ్రభాగాన నిలుపుదాం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



**నవతరం -శ్రీకాకుళం**

నూతన సంవత్సరం 2026 సందర్భంగా శ్రీకాకుళం జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి, ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యంగా పని చేస్తామని ఆయన పేర్కొన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ..వచ్చే ఏడాదిలో జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన పేదలందరికీ సకాలంలో అందేలా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

ముఖ్యంగా జిల్లాలో జరగనున్న అరసవిల్లి రథసప్తమి వేడుకలను ఈసారి రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించిందని, దీనిని ఏడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఈ సందర్భంగా గుర్తుచేశారు. యువత దురలవాట్లకు దూరంగా ఉండి, విద్యా రంగంలో జిల్లా పేరును నిలబెట్టాలని ఆయన ఆకాంక్షించారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

**నవతరం -శ్రీకాకుళం**



శ్రీకాకుళం నగరం లోని 31 డివిజన్ దండి వీధి, చాకలి వీధి, పట్నాయక్ కాలనీల్లో లబ్దిదారులకు బుధవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను డివిజన్ ఇన్‌చార్జి , ఏపీ కనీస వేతనాల సలహా మండలి సభ్యుడు విభూతి సూరిబాబు సచివాలయ సిబ్బందితో కలిసి లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పింఛను ఒక్కసారిగా రూ.వెయ్యి పెంచారని, అదే జగన్ వస్తే విడతల వారీగా పెంచే వారని ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేశారని, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ కూడా నియోజకవర్గం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. క్షేత్రస్థాయిలో ఆయన పర్యటిస్తూ ప్రతి పనిలో వందశాతం సక్సెస్‌ను తీసుకువస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తరుణ్, అబూ కురేషి, రామారావు , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సీపీఎం నాయకుల హెచ్చరిక

# వంశధార రిజర్వాయర్ పూర్తి చేయకుంటే పోరాటం




**నవతరం -కొత్తూరు**

శ్రీకాకుళం జిల్లాకు గుండెకాయ వంటి వంశధార రిజర్వాయర్ వెంటనే పూర్తిచేయకుంటే పోరాటం తప్పదని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి. గోవిందరావు. జిల్లాకమిటీ సభ్యుడు సిర్ల ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కొత్తూరు మండల కేంద్రంలో సీపీఎం పార్టీ కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ, వంశధార రిజర్వాయర్‌కు నీరు రావాలంటే నేరడి బ్యారేజీ నిర్మాణం జరగాలని, లేకుంటే తక్షణం లిఫ్టుల ద్వారా రిజర్వాయర్ నింపి రెండు పంటలకు నీరందిస్తే జిల్లాలో రెండు లక్షల 50 వేలు ఎకరాలకు గ్యారంటీగా నీరందిస్తే సంవత్సరానికి జిల్లాకు రూ.2వేల కోట్ల ఆదాయం వస్తుందన్నారు. దీంతో ప్రజల ఆదాయం, కొనుగోలు శక్తి పెరుగుతుందని, తద్వారా అనేక అనుబంధ పరిశ్రమలు రావడంతో, కూలీలకు ఉపాధి దొరుకుతుందన్నారు. అలాగే వలసల నివారణకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే ప్రజల భూములను కార్పొరేట్ కంపెనీలకు ఇవ్వడం ద్వారా కాదని, సాగునీటి ప్రాజెక్టులు నిర్మించడం ద్వారానే సాధ్యమని వారన్నారు. శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి చెందాలంటే వంశధార జలాలను వినియోగించడం ద్వారా ప్రజల ఆదాయం రెట్టింపవుతుందని వారు సూచించారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే రిజర్వాయర్ పూర్తి చేస్తే దానికి అయ్యే ఖర్చు ఏడాదిలోనే వస్తుందని, మరి ఎందుకు పూర్తి చేయడం లేదో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో ఎందుకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించడం లేదని వారు ప్రశ్నించారు. శ్రీకాకుళం జిల్లా వెనుకబాటుకు కారణం పాలకుల నిర్లక్ష్యమేనని వారు విమర్శించారు. పాలకుల విధానాల కారణంగా జిల్లా వెనుకకు నెట్టబడుతుందని, ఆదాయం కోల్పోతుందని వారన్నారు. గొట్టాబ్యారేజ్ నిర్మాణం జరిగి 50 ఏళ్ళు పూర్తయి శిధిలావస్థకు చేరుకుందని వారన్నారు. గొట్టాబ్యారేజ్ ఆధునికీకరణకు రూ. 1500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వంశధార రిజర్వాయర్ 21 గ్రామాల ప్రజలు త్యాగాలతో నిర్మించారని, నీరు రాకపోవడంతో అదో పెద్ద చెరువులా నిరుపయోగంగా మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

వంశధార ప్రాజెక్టు నిర్మాణానికి భూములిచ్చిన నిర్వాశితులను ఆదుకోవాలని, జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. వంశధార నదీ జలాలను చివరి భూముల వరకు అందించాలని, వంశధార బ్యారేజ్‌ను ఆధునికీకరించాలని, జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు ఎన్.అప్పన్న. ప్రజాసంఘాల నాయకులు రమేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సరానికి ముందస్తు పెన్షన్..



**నవతరం -హిరమండలం**

హిరమండలం మండలం తంప గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజిఆర్ ..పాతపట్నం నియోజకవర్గం హిరమండలం మండలం తంప గ్రామంలో,ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న పాతపట్నం నియోజవర్గం గౌరవ శాసనసభ్యులు శ్రీ మామిడి గోవిందరావు గారు. అనంతరం ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను వివరించారు అలాగే రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు ఇంటి వద్దకే చేరుతాయని,సెలవు దినాలు ముందు రోజే పంపిణీ చేసిన ఘనత దేశ చరిత్రలోనే ఒక్క చంద్రబాబు నాయుడు గారికి చెందుతుందని ఎమ్మెల్యే కొనియాడారు కార్యక్రమంలో మండల అధికారులు,ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు..

# తిరుప్పావై - ధనుర్మాస వ్రతం




గోదాదేవి చిన్ననాటినుండి తన తండ్రిగారు దేవుని కథలు చెప్తుంటే శ్రద్ధగా విని , తాను కూడా దేవాది దేవుడైన శ్రీకృష్ణుని పెళ్ళి చేసుకోవాలని అనుకుంది. కానీ శ్రీకృష్ణునిది ద్వాపరయుగం. తాను కలియుగంలో జన్మించింది (అయోనిజా)కాబట్టి ద్వాపర యుగంలో గోపికలు కాత్యాయిని వ్రతం చేసి శ్రీకృష్ణుని ఎలా చేరుకున్నారో తాను కూడా అలాగే తిరుప్పావై,శ్రీవ్రతం చేసి తమ ఊరిలో వున్న మన్నారుని, అంటే శ్రీరంగనాథస్వామిని పెళ్ళి చేసుకోవాలని కోరు కుంది.తిరుప్పావై అంటే ఒక అద్భుతమైన విశిష్టమైన గ్రంథం ఇందులో "తిరు" అంటే " శ్రీ "అని పావై అంటే " వ్రతం" అని అర్థం. జీవుడు పరమాత్మను ఏ విధంగా సులభమైనరీతిలో చేరుకోవాలో అనే భక్తి మాధుర్యాన్ని ఈ తిరుప్పావై గ్రంథం మనకు తెలియజేస్తుంది. తిరుప్పావై ధనుర్మాస వ్రతం 30 రోజుల పండుగ. ఎటు చూసినా వెలిగే ఎటు చూసినా జ్ఞానమే ,ఒక్కొక్క వెలుగు ఒక్కొక్క మహోన్నత దివ్య వైభవాన్ని మోసుకొచ్చి మహా పాతకాలను నశింప చేస్తుంది. ఒక్కొక్క జ్ఞానం విష్ణు తేజస్సును మన హృదయాలకు అలంకరిస్తుంది. గోదా పాశురాలు అమోఘ తేజో మండలాలై, దశదిశలు ఆవరించి తేజోస్సమూహాలై మనస్సుని పరవశింపజేస్తాయి. ఆండాళ్ రచించిన తిరుప్పావై 30 పాశురములు.తిరుప్పావై – గోదాదేవి:కలియుగం ప్రవేశించిన తరువాత 98 సంవత్సరము గడిచిన నళనామ సంవత్సరంలో కర్కాటక మాసంలో శుక్లపక్ష చతుర్దశి మంగళవార యుక్త శుభదినాన పూర్వ ఫల్గుణి నక్షత్రంలో సాక్షాత్తు విష్ణు వచ్చి (ఆ భూలక్ష్మి) పుత్రికగా శ్రీ పెరియాళ్వార్లకు శ్రీ విల్లిపుత్తూరులోని తులసివనంలో అవధరించింది.శ్రీ ఆండాళ్ అళ్వారులలో ఒకరైన పెరియాళ్వార్ల పుత్రిక, వీరికి విష్ణు చిత్తులు అను నామము కూడా కలదు. శ్రీ ఆండాళ్ అయోనిజ. అంటే అందరిలా గర్భం నుండి కాక, తులసి వనంలో అవతరించింది. ఈమెకు తండ్రి పెట్టిన పేరు గోదాదేవి. గోదా అంటే "మాల" అని అర్థము.శ్రీ విల్లిపుత్తూరులో క్రీశ 716లో శ్రీగోదాదేవి తులసి వనంలో పెరియాళ్వార్లకు లభించింది. పన్నెందు మంది అళ్వారు లలో ఏకైక మహిళ మన గోదాదేవియే. ఈమె తండ్రి విష్ణుచిత్తులు (పెరియాళ్వారు) ప్రతిరోజూ వనంలోని పూలతో పూలదండలు. కూర్చి శ్రీరంగనాథస్వామికి ఆ మాలలను సమర్పించేవారు. తన తండ్రి పెరుమాళ్ళకు కైంకర్యం చేసే మాలలను వారికి తెలియకుండా గోదా అమ్మవారు ధరించి, దానిని తమ ఇంటి వెనుక ఉన్న బావి నీడలో చూసుకుని మురిసిపోయేది. ఇది తెలియని తండ్రి రోజూ అవ్వే మాలలను స్వామికి సమర్పించేవారు. అలా ధరించిన మాలలను ఇచ్చింది కాబట్టి శ్రీ గోదాదేవికి "చూడికుడుత్తనా చ్చియార్" అని పేరు వచ్చింది. అలాగే జీవులను రక్షించడానికి (వచ్చింది) అవధరించింది కాబట్టి ఆవిడకి శ్రీ "అండాళ్" అనే పేరు కూడా వచ్చింది.ఒకనాడు తండ్రి అయిన పెరియాళ్వార్లు శ్రీ గోదాదేవి తాను పూమాలలను ధరించి తరువాత స్వామికి సమర్పిస్తోందని గ్రహించి వారించగా శ్రీరంగనాధుడు పెరియాళ్వారునకు కలలో కనిపించి ఆమె ధరించి ఇచ్చిన మాలలే తనకు ప్రియమైనవి అని చెప్పి అదృశ్యమయ్యెను. చిన్ననాటినుండి తన తండ్రిగారు దేవుని కథలు చెప్తుంటే శ్రద్ధగా విని తాను కూడా దేవాది దేవుడైన శ్రీకృష్ణుని పెళ్ళిచేసుకోవాలని అనుకుంది. కానీ శ్రీకృష్ణునిది ద్వాపరయుగం. తాను కలియుగంలో జన్మించింది. (అయోనిజ )కాబట్టి ద్వాపరయుగంలో గోపికలు కాత్యాయిని వ్రతం చేసి శ్రీకృష్ణుని ఎలా చేరుకున్నారో తాను కూడా అలాగే తిరుప్పావై,శ్రీవ్రతం చేసి తమ ఊరిలో ఉన్న మన్నారుని, శ్రీరంగనాధస్వామిని పెళ్లి చేసుకోవాలని కోరుకుంది. అలా ఆండాళ్ చేసిన వ్రతమే తిరుప్పావై వ్రతం ఈ వ్రతం ధర్మస వ్రతంగా ఎంతో భక్తి శ్రద్ధలతో శ్రీ గోదాదేవి ఆచరించింది. గోదాదేవి మధుర భక్తి ఒక మధుర ఫలము లాగా పండి పక్వమై మధుర సుధలను చిలికించింది. ఆమె హృదయం అంతా నిండిన ప్రేమ అనువాదం ప్రేమోన్మాదంతో గానం చేస్తే, అవసరాలుగా ధారలు కట్టి తేనె సోనలై వెల్లి విరిసింది. గోదాదేవి భక్తి పారవశ్యం వల్ల భగవంతున్ని ప్రసన్నం చేసుకుంది భగవంతునికి తన భక్తుతో మంగళ శాసనము చేసిన మహా గొప్ప భక్తురాలు. జీవాత్మ , పరమాత్మను చేరే మధుర భక్తిని ఈ లోకానికి అందించిన మహాస్వాధ్వి. ఆమె ఆచరించిన దివ్యమైన 'ధనుర్మాస వ్రతము' లోని పాశురములు పారాయణం లోకమందరికి శ్రేయస్సునందిస్తుంది



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# నూతన సంవత్సర వేడుకలకు దువ్వాడ శిబిరం సర్వం సిద్ధం

## వందలాది మందికి అల్పాహారం ఏర్పాట్లు

**నవతరం -పలాస**



నూతన సంవత్సరం సందర్భంగా ప్రముఖ న్యాయవాది, పలాస జిల్లా కేంద్ర సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్ ( బాబా) నివాసం న్యూ ఇయర్ వేడుకలకు సర్వం సిద్ధమైంది. వేదిక ప్రాంగణం సందడితో కళకళలాడనుంది. పలాస నియోజకవర్గం నలుమూలల నుంచి అభిమానులు పెద్ద ఎత్తున తరలిరానున్న నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాటు చేయడంతో పాటు వందలాది మందికి అల్పాహారం సౌకర్యం కల్పించనున్నారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని దువ్వాడ శ్రీధర్ ( బాబా) ఒక ప్రకటన విడుదల చేస్తూ.. కొత్త ఏడాదిని ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని, 2026 లో ప్రతి ఒక్కరికి ఆ షిరిడి సాయిబాబా అనుగ్రహం సంపూర్ణంగా లభించాలని అభిలాషించారు. ఈ నూతన సంవత్సరంలో కొత్త ఆశలు , అవకాశాలు, సరికొత్త ఆనందాలతో, పాడి పంటలు సమృద్ధిగా పండి, తద్వారా అందరూ సుభిక్షంగా ఉండాలని ఆయన కోరుకున్నారు. పలాస నియోజకవర్గ ప్రజలకు దువ్వాడ శ్రీధర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వచ్చే ఏడాదిలోనైనా పలాసను జిల్లా కేంద్రం చేయాలని, అందుకు ప్రజా గొంతు గా పోరాట ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి నుంచి అన్ని వర్గాల ప్రజలు, రాజకీయాలకు అతీతంగా వివిధ స్థాయిలో ఉన్న ప్రజా ప్రతినిధులు , వ్యాపారులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు, కర్షకులు, యువత, మహిళలు పలాస జిల్లా కేంద్రాన్ని ప్రభుత్వం ప్రకటించే వరకు సంపూర్ణ మద్దతునివ్వాలని దువ్వాడ శ్రీధర్ ( బాబా) కోరారు.



# డైరక్టర్లకు బిరుదులు కేటాయించిన ప్రభాస్

పవర్ స్టార్, రెబల్ స్టార్, గ్లోబల్ స్టార్, ఐకాన్ స్టార్, సూపర్ స్టార్.. ఇలా ప్రతి హీరోకు బిరుదులున్నాయి. మరి దర్శకులకు ఇలాంటి ట్యాగ్ లైన్స్ పెడితే ఎలా ఉంటుంది. ఆ ట్యాగ్ లైన్స్ ను స్వయంగా ప్రభాస్ కేటాయిస్తే ఎలా ఉంటుంది. తన దర్శకులకు ప్రభాస్ కొన్ని బిరుదులు కేటాయించాడు. వీళ్లలో రాజమౌళి, పూరి జగన్నాథ్ లను జీనియస్ లుగా చెప్పుకొచ్చాడు. రాజమౌళి హవా ప్రస్తుతం నడుస్తుందని, కానీ పూరి జగన్నాథ్ ఎప్పుడో ట్రెండ్ క్రియేట్ చేశాడని అన్నాడు. ఇక సందీప్ రెడ్డి వంగకు కల్ట్ డైరక్టర్ అనే ట్యాగ్ లైన్ ఇచ్చేశాడు. నాగ్ అశ్విన్ ను స్ట్రాంగ్ డైరక్టర్ అని, ప్రశాంత్ నీల్ ను బ్యూటిఫుల్ పర్సన్ గా, మారుతిని క్యూట్ పర్సన్ గా, హను రాఘవపూడిని హార్డ్ వర్కింగ్ గా, సుజీత్ ను వెరీ స్మార్ట్ గా చెప్పుకొచ్చాడు.

లాంగ్ గ్యాప్ తర్వాత జనం మధ్యలోకి వచ్చాడు ప్రభాస్. రాజాసాబ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ లో మెరిశాడు. ఇదే వేదికపై దర్శకుడు మారుతి ఎమోషనల్ అయ్యాడు. ప్రభాస్ గురించి మాట్లాడుతూ కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఒక దశలో ప్రభాస్ స్టేజ్ పైకి వచ్చి, మారుతిని ఓదార్చాల్సి వచ్చింది.

ఈ సందర్భంగా మాట్లాడిన మారుతి.. సినిమా ఏమాత్రం నిరాశపరిచినా తన ఇంటికొచ్చి ప్రశ్నించండంటూ తన ఇంటి అడ్రస్ చెప్పడం విశేషం.

# ఈ హీరో ప్లానింగ్ కరెక్టేనా..?

సినిమాలు చేయడంలో ఒక్కో హీరోది ఒక్కో ప్లానింగ్. రామ్ చరణ్, బన్నీ లాంటి హీరోల ప్లానింగ్ చూస్తున్నాం. విజయ్ దేవరకొండ తనదైన సినిమాలతో ముందుకెళ్తున్నాయి. ఎటొచ్చి తేజ సజ్జా ప్లానింగే కాస్త వింతగా ఉంది. ఇతడు పూర్తిగా సీక్వెల్స్ పై ఆధారపడ్డాడు.

కొత్త ఏడాదిలో పూర్తిగా 2 సినిమాలకు అంకితం కాబోతున్నాడు తేజ సజ్జా. అవి కూడా సీక్వెల్స్ కావడం విశేషం. వీటిలో ఒకటి మిరాయి సీక్వెల్ కాగా, రెండోది జాంబీ రెడ్డి సీక్వెల్. తన కెరీర్ లో సూపర్ హిట్టయిన ఈ 2 సినిమాలు, సీక్వెల్స్ పరంగా కూడా కలిసొస్తాయని తేజ ఆశపడుతున్నాడు.

హిట్ సినిమాకు సీక్వెల్ అంటే కచ్చితంగా ప్రేక్షకుల్ని ఆకర్షిస్తుంది. మార్కెట్ చేయడం కూడా ఈజీ అవుతుంది. అదే టైమ్ లో ఒకే పాత్రకు పరిమితమైపోయాడనే విమర్శ కూడా వస్తుంది. ఈ విషయంలో ప్రభాస్ కాస్త జాగ్రత్తపడ్డాడు. సలార్-2, కల్కి-2.. ఇలా వరుసగా సీక్వెల్స్ పడుతున్నాయనే ఉద్దేశంతో రాజాసాబ్ చేశాడు. ఫౌజీ కూడా చేస్తున్నాడు. తేజ సజ్జా కూడా అలాంటి ప్రయత్నం చేస్తే బాగుంటుందేమో.


ఈ ఏడాది చాలా కొద్దిమంది హీరోలకు మాత్రమే కలిసొచ్చింది. అందులో తేజ సజ్జా కూడా ఒకడు కావడం అతడి అదృష్టం. వచ్చే ఏడాది కూడా అదే లక్ కొనసాగితే, సీక్వెల్స్ తో కూడా మెరుస్తాడు ఈ కుర్ర హీరో.



# ఆట్టాడకు 'శ్రమ' అవార్డు

**నవతరం-శ్రీకాకుళం**

- విశాఖ శ్రామిక ఉత్సవంలో ప్రధాన ఉపన్యాసం
- వర్గ దృష్టితోనే అభ్యుదయ సాహిత్యం సాధ్యం



తెలుగు సాహిత్య రంగానికి ప్రత్యేక పరిచయం అవసరంలేని ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడుకు మంగళవారం విశాఖలో జరిగిన శ్రామిక ఉత్సవంలో ' శ్రమ ' అవార్డును పలువురు ప్రముఖుల సమక్షంలో ప్రధానం చేశారు. కవిగా, రచయితగా, సామాజిక విశ్లేషకునిగా అప్పలనాయుడు సుపరిచితులు. రాష్ట్ర ప్రభుత్వ స్వర్ణ హంసతో పాటు ఆయన ఎన్నో అవార్డులు, సత్కారాలు అందుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ, తెలుగు విభాగం సభ్యునిగా కూడా పనిచేశారు. మంగళవారం ఉదయం విశాఖ శ్రామిక సాహిత్య వేదికపై ' అభ్యుదయ సాహిత్య భావ ధార ' అనే అంశంపై ఆయన ప్రధానో ఉపన్యాసం చేశారు. సరైన రాజకీయ దృక్పథం, వర్గదృష్టి ఉంటేనే అభ్యుదయ సాహిత్య సృచి జరుగుతుందని స్పష్టం చేశారు. అవార్డు ప్రధాన కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు, అభ్యుదయ వాది మాదల రవి, సినీనటి రోహిణి, పూర్వ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, సాయితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ తదితరులు పాల్గొన్నారు. అప్పలనాయుడుకు అవార్డు ప్రధాన చేయడం పట్ల అరసం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నల్లి ధర్మారావు, చింతాడ కృష్ణారావు, కదా నిలయం తరపున దాసరి రామచంద్ర రావు, సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కే శ్రీనివాస్, సిక్కోలు బుక్ ట్రస్ట్ వ్యవస్థాపకులు దుప్పల రవికుమార్, ప్రముఖ కవులు కంచరాన భజంగరావు, కలమట దాసు బాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## బహుభాషా నాటకోత్సవాల్లో కన్నీటి బ్రతుకు

# నాటకంకు బెస్ట్ ప్రొడక్షన్

### డాక్టర్.కుమార్ నాయక్‌కు ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా అవార్డు



**నవతరం-శ్రీకాకుళం**

స్వాగత ప్రోగ్రెసివ్ డ్రామా ఆర్గనైజేషన్ 35వ రంగ మహోత్సవ వార్షికోత్సవం సందర్భంగా ఒడియా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గంజాం కళాపరిషత్ బరంపురంలో బహు బాస నాటకోత్సవాలు ఘనంగా మంగళవారం 30వ తేదీతో ముగిశాయని నటుడు కుమార్ నాయక్ తెలిపారు జార్ఖండ్ రాష్ట్రం నుండి హిందీ నాటకం లుహోరే నేహి, ఒడిస్సా రాష్ట్రం నుండి ఒడియా నాటకం చంద్రా దిత్యా, వెస్ట్ బెంగాల్ రాష్ట్రం నుండి బెంగాలీ నాటకం సాంకొల్పో, ఆంధ్రప్రదేశ్ నుండి తెలుగు నాటకం కన్నీటి బ్రతుకు, మహారాష్ట్ర నుండి మరాఠీ నాటకం కయకల్పి, తమిళనాడు రాష్ట్రం నుండి తమిళ్ నాటకం సురభి నాటికలు ప్రదర్శించబడ్డాయని తెలిపారు. కన్నింటి బ్రతుకు నాటకం ఉత్తమ ప్రొడక్షన్ గా ఎంపికై ,ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా డాక్టర్ కుమార్ నాయక్ కు దక్కింది. బిడ్డలకు ఆస్తులు ,అంతస్తులు ,సంపాదించి పెట్టిన తల్లిదండ్రులు చరమాంకము లో బిడ్డలకు భారంగా మారి వృద్ధాశ్రమాలవైపు అడుగులేస్తున్న ఘట్టాలను కళ్ళకు అద్దినట్టుగా ప్రదర్శించారు. సుహానీ క్రియేషన్స్ అధినేత డాక్టర్ తిరుపతి సాహు దర్శకత్వంలో డాక్టర్ నల్లసురేష్ చౌదరి ,డాక్టర్ కుమార్ నాయక్, డాక్టర్ నల్ల తిరుపతి సాహూ, నల్ల నీలకంఠ, నల్ల గోవిందరాజు, నల్ల నాగేశ్వరరావు, నల్ల సుజాత, దీపక్ ప్రధాన్ , రజనీ నహక్,నటించగా సంగీత దర్శకులుగా రమేష్ చంద్ర సాయి,బి శంకర్ ,కూర గౌడ వ్యవహరించారు.

## ఎన్. టి.ఆర్.భరోసా పింఛన్ కార్యక్రమంలో

# పాల్గొన్న కణితి కిరణ్

**నవతరం టెక్కలి**



నేడు స్థానిక టెక్కలి 4వ సచివాలయం పరిధిలో గల సోగ్గాడి పేటలో జరిగిన ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో కూటమి నాయకులుతో కలసి టెక్కలి నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ కనితి కిరణ్ కుమార్ పాల్గొన్నారు. తదుపరి స్థానిక సోగ్గాడి పేట జనసేన నాయకులు తో కలసి సోగ్గాడి పేట నాలుగు వీదులు తిరిగి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తన ద్రుష్టి కి తీసుకు వచ్చిన డ్రైనేజీ, కలుషిత నీటి సరఫరా, వీధి లైట్లు పై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కారం చూపిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమం లో అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీమతి ఎ. మహాలక్ష్మి, కూటమి నాయకులు శ్రీ మామిడి నారాయణ రావు , జనసేన నాయకులు శ్రీ సోమేష్, ప్రదీప్ మరియు సోగ్గాడి పేట జనసేన యువత పాల్గొన్నారు.

## పొందర కృష్ణారావు మాస్టారుకు

# ఘన పదవీ విరమణ సన్మానం

**నవతరం-మందస**




మండల కేంద్రమైన మందస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయులుగా దీర్ఘకాలం సేవలందించిన పొందర కృష్ణారావు బుధవారం పదవీ విరమణ చేసిన సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఆయన సతీమణి సబిత దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యా కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, విద్యార్థుల విద్యాభివృద్ధి, పాఠశాల అభివృద్ధి కోసం నిరంతరం అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయుడిగా పొందర కృష్ణారావు ప్రజల మన్ననలు పొందారని ప్రశంసించారు. విద్యార్థి దశ నుంచి ఉపాధ్యాయునిగా పనిచేసిన కాలంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి, ప్రజా సమస్యలపై ప్రజల పక్షాన నిలబడి గుర్తింపు సంపాదించారని తెలిపారు.పాఠశాల హెడ్‌మాస్టర్ ఎం. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పితా తొలి పంచాయతీ సర్పంచ్ చింతాడ సుధా గణపతి, ఉపాధ్యాయులు మల్లీ కార్జునారావు, ఎస్. గణేశ్వరరావు, దుర్గాప్రసాద్, పాణిగ్రాహి సురేష్ చంద్ర, పండ సత్యనారాయణ, సుశాంత్ కుమార్ రావు, లో రామచంద్ర పాణిగ్రహి, గున్న గంగాధరరావు, న్యాయవాది చింతాడ ఏకాంబరం, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు గుంట కేశవరావు, కొర్ల పాపారావు, వాయిలపల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## హిందీ మంచ్ క్యాలెండర్లను ఆవిష్కరించిన

# రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**నవతరం-విజయనగరం**




హిందీ భాషాభిమానుల సంస్థ హిందీ మంచ్ విజయనగరం జిల్లాశాఖ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను రాష్ట్ర ఎంఎస్ఎన్ఈ, సెర్ప్ , ఎన్నారై సాధికారిత శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం ఆవిష్కరించారు. బుధవారం సాయంత్రం స్థానిక మంత్రి క్యాంప్ ఆఫీస్ లో జరిగిన కార్యక్రమంలో క్యాలెండర్లను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, హిందీ మంచ్ సభ్యులు హిందీ భాషాభివృద్ధికి నూతన సంవత్సరంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.
హిందీ మంచ్ జోనల్ కార్యదర్శి కోనే శ్రీధర్ (విశాఖపట్నం) మాట్లాడుతూ, గత 20 ఏళ్లుగా హిందీ మంచ్ సంస్థ ఉత్తరాంధ్ర ఉమ్మడి మూడు జిల్లాల్లో జాతీయ భాష హిందీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు మంత్రి కి తెలిపారు. కార్యక్రమంలో మంచ్ విజయనగరం జిల్లాశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి శ్రీనివాసరావు, ఎన్. చిన్నాదేవి, సహాధ్యక్షురాలు భోగరాజు సూర్యలక్ష్మి, ఉపాధ్యక్షులు విజయకుమార్, సహాయ కార్యదర్శి ఎస్ .సంతోషి, జోనల్ కమిటీ కోశాధికారి ఎం.వి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాల ఆకులతో ఆది గణపతి

**(నవతరం పొందూరు)**

### నూతన సంవత్సరానికి వినూత్న కళా సందేశం




ఆకులను అక్షరాలుగా మలిచి, ఆ అక్షరాలతోనే ఆది గణపతి రూపాన్ని ఆవిష్కరించిన వినూత్న కళాఖండం చూపరులను ఆకట్టుకుంటోంది. 2026 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రూపొందించిన ఈ ప్రత్యేక చిత్రాన్ని పొందూరు మండలంకు చెందిన యువ చిత్రకారుడు కేత శ్రీను రూపొందించారు. సాంప్రదాయ భావానికి ఆధునిక కళా స్పర్శను జోడిస్తూ, ప్రకృతిసంస్కృతి సమన్వయాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ చిత్రం కళాభిమానుల ప్రశంసలు అందుకుంటోంది. అక్షరాల ద్వారా గణపతి స్వరూపాన్ని ఆవిష్కరించడం ఆయన సృజనాత్మకతకు నిదర్శనంగా నిలుస్తోంది.గ్రామీణ ప్రాంతాల నుంచి ఇలాంటి వినూత్న కళా ప్రయోగాలు రావడం అభినందనీయం. యువ కళాకారులను ప్రోత్సహిస్తే, మరెన్నో సృజనాత్మక ప్రతిభలు వెలుగులోకి వస్తాయని కళాభిమానులు అభిప్రాయపడుతున్నారు. చిత్రకారుడు: కేత శ్రీను, పొందూరు

### మంత్రి అచ్చం నాయుడు, ఎమ్మెల్యే గోండు శంకర్ చేతుల మీదుగా పలు రోడ్ల ఓపెనింగ్

# బలగ ప్రాంతాల్లో అభివృద్ధి బాట

# కొత్త రోడ్లకు ఘన ప్రారంభోత్సవాలు

**(నవతరం శ్రీకాకుళం)**



శ్రీకాకుళం నగరంలోని బలగ ప్రాంతాలు అభివృద్ధి దిశగా మరో ముందడుగు వేశాయి. నగరాభివృద్ధిలో భాగంగా పలు కాలనీల్లో నిర్మించిన రోడ్లకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం పేట వరం కాలనీ, బావాజీ నగర్, చిట్టివారి తోట ప్రాంతాల్లో కొత్త రోడ్లను ప్రజలకు అంకితం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రివర్యులు కింజరాపు అచ్చం నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని రోడ్లను ప్రారంభించారు. శ్రీకాకుళం శాసనసభ్యులు గోండు శంకర్, జిల్లా కలెక్టర్ హాజరై అభివృద్ధి పనుల ప్రాధాన్యతను వివరించారు. రోడ్ల నిర్మాణంతో ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు అందుబాటులోకి వచ్చాయని వారు పేర్కొన్నారు.వార్డు ఇన్‌చార్జ్ రెడ్డి గిరిజ శంకర్, చిట్టి నాగభూషణం, పిఎంజె బాబు, మోకాళ్ళ సింహాద్రి నాయుడు, అక్కిన రాజారావు, జాక్ శ్యాంసుందర్రావు, కెవిఎస్ నాయుడు, సాదు అజయ్, సాదు పరమేష్, తంగి నర్సింగరావు, నగరపాటి అధ్యక్షులు పాండ్రంకి శంకర్, మట్ట మురళి, గోండు రాము, జగన్ తదితర నాయకులు పాల్గొన్నారు.ఈ అభివృద్ధి కార్యక్రమాలతో బలగ ప్రాంతాల రూపురేఖలు మారుతున్నాయని, రానున్న రోజుల్లో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహంగా విజయవంతం చేశారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**